

## మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు

2



## మున్సిపల్ వాటర్‌మన్‌కు పాముకాటు..

2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## 45వ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని 45వ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేసినట్లు డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్ పేర్కొన్నారు. అమృత్ 2.0 స్కీంలో భాగంగా కాకతీయ స్కూల్ నుంచి శ్రీనగర్, అమరేశ్వర్ కాలనీ, ప్రగతి నగర్ ఎల్లమ్మ గుట్ట వరకు కొత్త వాటర్ పైప్‌లైన్ మంజూరైందన్నారు. సోమవారం వాటిని భూమిపూజ చేసి పనులు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.



# ‘సర్’ పర్యవేక్షణకు కాంగ్రెస్ ప్రణాళిక..

**పర్యవేక్షకులు, అసెంబ్లీ కో ఆర్డినేటర్ల నియామకం**



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్** : ఎస్ఐఆర్ ప్రక్రియలో వేగం పెంచేందుకు కాంగ్రెస్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. అర్హుల ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు కార్యాచరణతో ముందుకు వెళ్తోంది. ఇప్పటికే ఆయా డివిజన్లలో ముఖ్య నాయకులు అవగాహన కల్పించగా.. తాజాగా నగరంలో పర్యవేక్షకులు, అసెంబ్లీ కోఆర్డినేటర్లను నియమిస్తూ కాంగ్రెస్ ఆదేశాలు జారీ చేసింది. నిజామాబాద్ డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో 60డివిజన్లకు పర్యవేక్షకలును, అసెంబ్లీ కోఆర్డినేటర్లను నియమించారు. జిల్లాలోని సీనియర్ నాయకులను సంప్రదించి వారి పర్యవేక్షణలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలని నిర్ణయించారు. పర్యవేక్షకుడు గడుగు గంగాధర్‌కు శివచరణ్, మహమ్మద్ వహీద్, బంటు బలరాం సూపర్‌వైజర్లుగా వ్యవహరించనున్నారు. అలాగే తాహెర్ బిన్ హందాన్‌కు ముస్తఫా అల్కాఫ్, సయ్యద్ హర్షద్, ఎండీ జియా అహ్మద్ సూపర్‌వైజర్లుగా ఉంటారు. కేశ వేణుకు ఆకుల శ్రీశైలం, అంతరెడ్డి విజయ్‌పాల్, అపర్ణపాటిల్ కోఆర్డినేటర్లుగా ఉంటారు. ఎం శేఖర్ గౌడ్‌కు సకినాల శివకుమార్, సర్దార్ నరేందర్ సింగ్ కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారు. పర్యవేక్షకురాలు కవితారెడ్డికి ఆకుల వెంకటేష్(రాజు), జిల్లెల రమేష్ కోఆర్డినేటర్లుగా ఉంటారు.



“ఎస్ఐఆర్ ప్రక్రియలో కీలకమైన ఓటర్ల ఎన్యుమరేషన్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో ఉమ్మడి జిల్లాలో బీఎల్‌వోలు, అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే ఫారాలు సకాలంలో చేరకపోవడం, చేరినా నింపడంలో ఇబ్బందులు, ప్రభుత్వ సిబ్బంది సహకారం లేకపోవడంతో ఈ ప్రక్రియ విజయవంతమవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**– అక్షరటుడే, కామారెడ్డి**

# ‘సర్’ సక్సెస్‌కు ఆటంకాలెన్నో..!

- నత్తనడకన సాగుతున్న ప్రక్రియ
- ఇప్పటికీ కొన్నిచోట్ల ఓటర్లకు చేరని ఎన్యుమరేషన్ ఫారాలు
- చేరినా వాటిని నింపలేని పరిస్థితుల్లో ఓటర్లు
- ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఫారం నింపేందుకు నిర్లక్ష్యం
- బీఎల్‌వోలతో దురుసుగా ప్రవర్తిస్తున్న కొందరు ఓటర్లు

ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయడానికి సర్పంచులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణాల్లోకి వచ్చేసరికి మాత్రం ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ముఖ్యంగా ఓటర్ల చిరునామాలు అనేక మార్లు మారడంతో ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోంది.

### చేరని ఫారాలు, నింపలేని పరిస్థితి..

గ్రామాల్లో ఫారాలు అందినా పట్టణాల్లో ఇంకా చాలా మందికి అందలేదు. సిబ్బంది కొరత, పెద్ద కాలనీలు ఉండటంతో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లలేకపోతున్నారు. కొన్నిచోట్ల ఒకే కుటుంబంలో కొందరికే ఫారాలు ఇచ్చి మిగిలిన వారిని వదిలేస్తున్న ఘటనలున్నాయి. ఫారాలు అందినా వాటిని నింపడంలో ఓటర్లు ఇబ్బంది పడుతున్నారు. ఫారంలో ఎం నింపాలో తెలియక.. అలాగే వదిలేస్తున్నారు. వృద్ధులు, చదువు రానివారు బీఎల్‌వోలు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఫారం ఇచ్చారు కానీ ఏం రాయాలో చెప్పడం లేదని ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉద్యోగుల నిరాకరణ, బీఎల్‌వోలపై ఒత్తిడి

ఈ ప్రక్రియలో సహకరించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అదనపు పని అంటూ నిరాకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బీఎల్‌వోలపై పనిభారం పెరిగి టార్గెట్ పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. మరోవైపు విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వోలపై కొందరు ఓటర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ‘మా ఇంటికే వచ్చి ఫారం ఇవ్వాలి’ అంటూ ఫోన్లలో బెదిరిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. అడ్రస్ తెలియక రాలేకపోతున్నామని



చెప్పినా సహకరించడం లేదని బీఎల్‌వోలు వాపోతున్నారు.

### డెడ్‌లైన్ లోపు పూర్తయ్యేనా..!

ఓటర్ జాబితా ఎన్యుమరేషన్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈనెల 24వ తేదీలోపు ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఓటర్ల ఆవేదన, బీఎల్‌వోలపై ఒత్తిడి, చదువుకున్న వాళ్లు సైతం ఎన్యుమరేషన్ ఫారం నింపలేని స్థితిలో బీఎల్‌వోలపై భారం మోపడంతో ప్రక్రియ పూర్తి అవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కామారెడ్డి పట్టణంలో ఇద్దరు ఓటర్లు బీఎల్‌వోలపై దాడి చేయడంతో మిగతా బీఎల్‌వోలు సైతం భయపడే పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు లేకున్నా పట్టణాల్లో వివిధ రకాల మైండ్‌సెట్ ఉన్న కొంతమంది వ్యక్తులను కలిసి వారిని సముదాయించడం బీఎల్‌వోలకు కష్టంగా మారుతోంది. మెజారిటీ ప్రజలు బీఎల్‌వోలకు సహకరించడంతో ఇబ్బందులను దాటుకుని ముందుకు సాగుతున్నారు.

### కీలకంగా మారిన 2002 డేటా..

ఎన్యుమరేషన్‌లో 2002 బేస్ ఇయర్ జాబితా ప్రామాణికంగా ఉంది. అయితే ఆ వివరాలు తెలియక పలువురు ఫామ్ నింపడం లేదు. ఓటర్లు తమ వివరాలను voters.eci.gov.in లేదా ceotelangana.nic.in వెబ్‌సైట్లలో Year 2002 సెలెక్ట్ చేసి చెక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ రానివారు తహశీల్దార్ ఆఫీస్‌లో హార్డ్ కాపీ చూడొచ్చు. 1950 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి కూడా వివరాలు పొందవచ్చు. బీఎల్‌వోల వద్ద కూడా ఓటర్ జాబితా వివరాలు అందుబాటులో ఉంటాయి.

### 2002 జాబితా బీఎల్‌వోల వద్ద ఉంది..

2002లో ఓటు వేసి ఉంటే సంబంధిత ఓటరు జాబితా బీఎల్‌వోల వద్ద, ఎలక్షన్ వెబ్‌సైట్‌లో ఉంటుంది. బీఎల్‌వోల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ కొందరు ఫారాలు రాలేవని అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఫారం ఫిలప్ చేయకపోవడం బాధాకరం. వాళ్ల ఫారాలు కూడా మేమే ఫిలప్ చేస్తున్నాం. ఎవరిని ప్రశ్నించే స్థితిలో లేము. పని త్వరగా పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.

**- హిమబిందు, తహశీల్దార్, కామారెడ్డి**



## జేసీఐ ఇందూర్‌కు అవార్డుల పంట

**అక్షరటుడే, ఇందూరు:** సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్న ఇందూరు జేసీఐకి అవార్డుల పంట పండింది. జేసీఐ ఇండియా జోన్-12 ఆధ్వర్యంలో హైదరాబాద్ హోటల్ కత్రియాలో ‘తేజాస్ మిడ్‌కాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఐ ఇందూర్ చేసిన సేవా కార్యక్రమాలకు గాను పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందజేశారు. అవార్డులను రీజియన్-సి వైస్ ప్రెసిడెంట్ జయంత్ శెట్టి అందజేశారు. ఉత్తమ అధ్యక్షుడిగా జైపాల్ కాలే, ఉత్తమ కార్యదర్శిగా తేజస్వి తిరునగరి ఎంపికయ్యారు. సంస్థ అభివృద్ధికి విశేష సహకారం అందించినందుకు పూర్వ అధ్యక్షుడు నయన్ జిల్కార్, పూర్వ జోన్ వైస్ ప్రెసిడెంట్ జేసీఐ సెనేటర్ విజయానంద్ జిల్‌కర్‌కు ప్రత్యేక అవార్డులు ప్రదానం చేశారు.



## ఆల్బెండజోల్ మాత్రాలతో నులిపురుగుల నివారణ

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఆల్బెండజోల్ మాత్రాలతో నులిపురుగుల నివారణ సాధ్యమేనని అడిషనల్ కలెక్టర్ భుగంజరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ వద్ద మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుండి 19ఏళ్లలోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. ఏలిక పాములు, కొంకిపురుగులు, నులిపురుగుల వల్ల విద్యార్థులలో రక్తహీనత, అలసట, కడుపులో నొప్పి, డయేరియా, డీసెంట్రీ, లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. కాబట్టి ఒకటి నుండి 19ఏళ్ల వయసు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రను బాగా నమిలి చప్పరించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని రాజశ్రీ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన మొత్తం ఒకటి నుండి 19ఏళ్లలోపు విద్యార్థులు 3,90,297 మంది ఉన్నారన్నారు. డీఐవో అశోక్, రీజనల్ కోఆర్డినేటర్ సత్య నాథ రెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సికందర్ నాయక్, ప్రిన్సిపాల్ స్వప్న తదితరులున్నారు.



## భీమ్‌గల్‌లో వైభవంగా ‘ఊర పండుగ’

**అక్షరటుడే, భీమ్‌గల్:** కులమతాలకు అతీతంగా, అన్ని వర్గాల కుల సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ఊరపండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం మొక్కులు చెల్లించుకున్నారు. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలందరూ చిన్నపెద్ద తేడా లేకుండా ఏకతాటిపైకి వచ్చి ఈ సామూహిక ఉత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం అభినందనీయమన్నారు. సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


## నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం** : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవచ్చని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని సీపీ కార్యాలమంలో సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయంలో బాధితుల నుంచి 39 ఫిర్యాదులను సీపీ సాయిచైతన్య స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు.

## నిజామాబాద్ మెడికల్ కళాశాలలో 150కి పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల మరో కీలక మైలురాయిని అందుకుంది. కళాశాలలో ప్రస్తుతం ఉన్న ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 120 నుండి 150కి పెంచుతూ నేషనల్ మెడికల్ కమిషన్ అధికారిక అనుమతి ఇచ్చింది. కళాశాలలో అదనంగా మరో 30 సీట్లను పెంచాలనే ప్రతిపాదన కొన్నాళ్లుగా ఉంది. దీనికి సంబంధించి జూన్ 17వ తేదీన ఎన్ఎంసీ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అసెస్మెంట్ అండ్ రేటింగ్ బోర్డుకు చెందిన నలుగురు సభ్యుల అసెస్సర్ల బృందం జిల్లాకు వచ్చేసింది. నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లలో ప్రత్యక్ష తనిఖీలు నిర్వహించింది. కాలేజీలోని వసతులు, ప్రయోగశాలలు, ఆస్పత్రిలోని మౌలిక సదుపాయాలను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. తనిఖీ నివేదిక ఆధారంగా, ఎన్ఎంసీ బోర్డు కళాశాలలో 120సీట్లకు అదనంగా మరో 30 సీట్లను కలుపుతూ, మొత్తం 150 సీట్లకు గానూ అధికారిక అనుమతి పత్రాన్ని జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచే పెరిగిన సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఎన్ఎంసీ అనుమతితో జిల్లా విద్యార్థులకు వైద్య విద్య అభ్యసించేందుకు మరిన్ని అవకాశాలు మెరుగయ్యాయని పేర్కొన్నారు.





## మాస శివరాత్రి వేళ.. ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మాస శివరాత్రి పర్వదినాన జిల్లా కేంద్రంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి ఒకే రోజు రావడంతో ఉపవాసాలు చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని వేద పండితులు పేర్కొంటున్నారు. దీంతో శివాలయాల్లో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, శుంభుని గుడి ఇతర శివాలయాల్లో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

**– అక్షరటుడే, ఇందూరు**





## ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని టీజీవీపీ డిమాండ్ చేసింది. టీజీవీపీ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ , ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. న్యూబస్టాండ్ నుంచి జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులతో ర్యాలీగా వచ్చి నిజాంసాగర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. టీజీవీపీ జిల్లా అధ్యక్షులు గంధం సంజయ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎండీ సమీర్ ఖాన్, మోహన్, భరత్, ధనుష్, అఖిల్, నవీన్ పాల్గొన్నారు.

## మున్సిపల్ వాటర్‌మన్‌కు పాముకాటు..

**అక్షరటుడే, కామారెడ్డి:** విధుల్లో ఉన్న మున్సిపాలిటీ వాటర్‌మన్‌ను పాము కాటు వేసింది. ఈ ఘటన సోమవారం కామారెడ్డి మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. కామారెడ్డి మున్సిపాలిటీలో వాటర్ సెక్షన్‌లో వాల్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యామల శ్రీనివాస్ పాము కాటుకు గురయ్యారు. ఉదయం



ఎప్పటిలాగే వాటర్ ట్యాంకుల వద్ద పని చేస్తుండగా అతన్ని పాము కాటేసింది. వెంటనే అప్రమత్తమైన తోటి సిబ్బంది హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతనికి చికిత్స కొనసాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాస్‌ను పరామర్శించారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మున్సిపాలిటీ తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది సంక్షేమమే తమకు ఎల్లప్పుడూ ముఖ్యమని ఛైర్‌పర్సన్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.



బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలో కాలం చెల్లిన బస్సులు ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రోజూ ఏదో ఒక మార్గంలో ఆర్టీసీ బస్సులు సాంకేతిక లోపాలతో మార్గమధ్యలో నిలిచిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు గంటల తరబడి రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ రవాణా సేవలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

— అక్షరటుడే, బాన్సువాడ

# ఆర్టీసీ పాత బస్సులు..
# ప్రయాణికులకు కష్టాలు..!

■ కాలం చెల్లిన బస్సులతో తిప్పలు ■ తరచూ నిలిచిపోతున్న వైనం
■ రోడ్డుపై గంటలపాటు నిరీక్షిస్తున్న ప్రజలు ■ ఫిర్యాదులు అందినా స్పందించని అధికారులు

బాన్సువాడ డిపోలో ప్రస్తుతం 78 ప్రభుత్వ బస్సులు, 16 అద్దె బస్సులు నడుస్తున్నాయి. అయితే వీటిలో అధిక శాతం బస్సులు రెండు దశాబ్దాల క్రితం డిపోకు కేటాయించినవేనని తెలుస్తోంది. మరికొన్ని డిపోల్లో పనికిరావని భావించిన పాత బస్సులను కూడా గతంలో బాన్సువాడ డిపోకు కేటాయించడంతో ప్రస్తుతం వాటినే మరమ్మతులు చేస్తూ నడిపిస్తున్నారు. ఫలితంగా తరచూ ఇంజిన్, క్లచ్, బ్రేకులు, స్టీరింగ్, గేర్‌బాక్స్ తదితర భాగాల్లో లోపాలు తలెత్తి బస్సులు మార్గమధ్యలో నిలిచిపోతున్నాయి.

### తరచూ జరుగుతున్న ఘటనలు

ఇటీవల బాన్సువాడ నుంచి దెగ్లూర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుడ్మి చౌరస్తా వద్ద స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఒక్కసారిగా నిలిచిపోయింది. అదృష్టవశాత్తూ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే ఆదివారం బాన్సువాడ నుంచి నిజామాబాద్‌కు ప్రయాణికులతో బయలుదేరిన బస్సు మల్లారం అటవీ ప్రాంతంలో సాంకేతిక లోపంతో ఆగిపోయింది. అటవీ ప్రాంతం కావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

### అత్యవసర ప్రయాణాలకు ఆటంకం

బస్సులు తరచూ నిలిచిపోవడంతో ఉద్యోగులు కార్యాలయాలకు, విద్యార్థులు కళాశాలలకు, రోగులు ఆస్పత్రులకు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు




పడుతున్నారు. కొన్నిసార్లు మరో ఆర్టీసీ బస్సు వచ్చే వరకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో చివరకు ఎక్కువ డబ్బులు ఖర్చు చేసి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో బస్సు వచ్చినా.. రద్దీ అధికంగా ఉంటుందని




పేర్కొంటున్నారు.

### డ్రైవర్లు, సిబ్బంది కూడా ఇబ్బందుల్లోనే..

పాత బస్సులను నడపడం డ్రైవర్లకు కూడా సవాలుగా మారిందని తెలుస్తోంది. ఎప్పుడు ఏ భాగం పనిచేయకుండా పోతుందో తెలియని పరిస్థితుల్లో ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వారు తీవ్ర ఒత్తిడిలో విధులు నిర్వహిస్తున్నారు. వర్క్‌షాప్‌లో మరమ్మతులు చేసినా కొద్ది రోజులకే మళ్లీ అదే సమస్యలు తలెత్తుతున్నాయని సమాచారం.

### కొత్త బస్సుల కోసం డిమాండ్

బాన్సువాడ డిపోకు వెంటనే కొత్త బస్సులను కేటాయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కాలం చెల్లిన బస్సులను దశలవారీగా తొలగించి ఆధునిక సదుపాయాలతో కూడిన కొత్త బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పాత బస్సులు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ పరీక్షలు చేసిన తర్వాతే రోడ్డుపైకి పంపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు బాన్సువాడ డిపో పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త బస్సులను కేటాయిస్తేనే ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సేవలు అందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సోమవారం డీపీఎల్‌వో శివకృష్ణ పరిశీలించారు. పోచంపాడ్ గ్రామంలో పర్యటించి బీఎల్‌వోల పనితీరు, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పరిశీలించారు. గణన ఫారాల సేకరణను మరింత వేగవంతం చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆర్ఐ వేణుగోపాల్ చారి, పంచాయతీ కార్యదర్శి భోజన్న, ఉప సర్పంచ్ సంపంగి సతీష్, రమేష్ పాల్గొన్నారు.



## సిద్దులగుట్టపై భోజనశాల నిర్మాణానికి భూమిపూజ

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ నవనాథ సిద్దుల గుట్టపై రూ.50 లక్షలతో నిర్మిస్తున్న భోజన శాలకు ఆర్మూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్ సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, కోడిగాల మల్లయ్య, జిమ్మరవి, రామగౌడ్, శ్రీనివాస్, సంధ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార సంఘానికి కేంద్ర నిధులు


**అక్షరటుడే, భీమ్ గల్:** జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) పథకం కింద మెండోరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి (ఎఫ్‌సీఎస్) ఆర్థిక లబ్ధి చేకూరడంపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా సొసైటీ ఖాతాలో నిధులు జమ చేయడం



పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా అందిన రూ.90,000 నిధులతో సొసైటీ కార్యాలయానికి కావాల్సిన ఫర్నిచర్‌తో పాటు సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేసేందుకు ఒక నూతన కంప్యూటర్ వ్యవస్థను కొనుగోలు చేశారు. ఈ నూతన సామగ్రిని బీజేపీ భీమ్ గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ సమక్షంలో ప్రారంభించారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డిల కృషిని కొనియాడుతూ సంఘ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెండోరా సొసైటీ అధ్యక్షుడు ముస్లి ఎర్రన్న, ఉపాధ్యక్షుడు కల్లెడ రవికుమార్, కార్యదర్శి గజనవేణి మోహన్, నాగార్జున్ రెడ్డి, అంజయ్య, బాబురావు, రాము, శ్రీనివాస్ గౌడ్, లింబయ్య పాల్గొన్నారు.

## సోమలింగేశ్వర స్వామిని దర్శించుకున్న పోచారం భాస్కర్ రెడ్డి

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులోని సోమలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని



ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి, శివనామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బాన్సువాడ, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఇతర సర్పంచ్‌లు

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తాళ్లరాంపూర్ సర్పంచ్ బెజ్జారం పావని కుటుంబానికి ఆలూర్ మండల సర్పంచులు అండగా నిలిచారు. రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పావని నివాసానికి వెళ్లిన సర్పంచులు ఆమె భర్త,



పిల్లలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని, తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైన ప్రతి సందర్భంలో కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు యల్లా సాయిరెడ్డి, ముక్కెర విజయ్, ఇట్టేడి లింగారెడ్డి, కొంద్ర కమల-దశరథ్, కట్ట నర్సయ్య, మచ్చర్ల చిన్నయ్య, గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్, కొండి గంగాధర్, తోగార్ల భూషణ్, కిషన్ నాయక్, సుమన్ పాల్గొన్నారు. పావని కుటుంబాన్ని ఆర్మూర్ మండల సర్పంచులు పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆర్మూర్ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు సారంగి శాంతి కుమార్, బద్దెల కిరణ్, గంగారం, రాజేందర్, గణేష్, నాగరాజ్, ప్రవీణ్, నర్సింలు, సంజు, లింబాద్రి, జీవన్ పాల్గొన్నారు.

## వినియోగదారుల మండలి నిజామాబాద్ జోనల్ కన్వీనర్‌గా సందు ప్రవీణ్

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో విస్తరిస్తున్న ఆహార కల్తీ మహమ్మారిని అరికట్టడానికి రాష్ట్ర పరిధిని మూడు జోన్లుగా విభజిస్తున్నట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు




చక్రపాణి ప్రకటించారు. సోమవారం నిజామాబాద్ గంగాస్థాన్2 నిజామాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేసే జోనల్ కమిటీని ప్రకటించారు. నిజామాబాద్ జోనల్ కన్వీనర్‌గా సందు ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. జోన్ పరిధిలో పూర్వ ఆదిలాబాద్ 4, పూర్వ నిజామాబాద్ 2, పూర్వ కరీంనగర్ 4, మెదక్ 3 జిల్లాలు ఉంటాయని చక్రపాణి తెలిపారు. ఈ జోనల్‌కు కన్వీనర్‌గా సందు ప్రవీణ్, కోకన్వీనర్లుగా ముకుంద రెడ్డి, ఓం ప్రకాష్, సంయుక్త కార్యదర్శులుగా వీఎన్ వర్మ, మహాదేవుని శ్రీనివాస్, యాటకర్ల దేవేష్, మరేళ్ల శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు. ఆహార నాణ్యతా పరీక్షల ఫలితాలు ఆలస్యంగా రావడం కేసులను బలహీనం చేస్తున్నాయన్నారు. కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## వర్షాల కోసం గ్రామ దేవతలకు పూజలు

**అక్షరటుడే, గాంధారి:** వానలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని మండలంలో బ్రాహ్మణపల్లి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. రామేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, గంగమ్మ, పోచమ్మ తల్లి, గ్రామదేవతలకు గ్రామంలోని ప్రజలంతా కలిసి సమీపంలోని చెరువులో బిందెలలో నీటిని తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి జలాభిషేకం నిర్వహించారు.



## పట్టు చేనేత సంఘం అధ్యక్షుడిగా గంగమోహన్ చక్రు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ క్షత్రియ పట్టు చేనేత సహకార సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగామోహన్ చక్రు, ఉపాధ్య క్షుడిగా షికారి శ్రీనివాస్, సెక్రెటరీగా వందన లక్ష్మీనారాయణ, కోశాధికారిగా బదాం రాజకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల 9 డైరెక్టర్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. డైరెక్టర్లు పడాల్ గణేష్, పడాల్ నరేందర్, ఖాందేశ్ సత్యం, నూతన్ శ్రీనివాస్, పోహార్ శైలేష్‌లు పాల్గొన్నారు.

## సర్పంచ్ పావని మృతి తీరని లోటు: ముత్యాల సునీల్ కుమార్

**అక్షరటుడే,భీమ్‌గల్(ఏర్గట్ల):** తాళ్లరాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జారపు పావని ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పావని భర్త భాను, కుమారులు భవిత్, భవిన్‌లను ఓదార్చారు.



వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోవద్దని భరోసా ఇచ్చారు. చిన్న వయసులోనే తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను చూసి సునీల్ కుమార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సర్పంచ్‌గా పావని కొద్దికాలంలోనే గ్రామాభివృద్ధికి ఎంతో చురుగ్గా కృషి చేశారని, ఆమె మరణం తాళ్లరాంపూర్ గ్రామానికి తీరని లోటన్నారు. ఏర్గట్ల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.